క్లుప్తంగా

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోండి

కొందుర్గు: సమ్మర్ క్యాంపులో భాగంగా మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కరాటే, కుంగ్‌ఫూ, కిక్ బాక్సింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నామని మాస్టర్ రమేశ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 9703850780ను సంప్రదించాలని సూచించారు.

మన్‌కీ బాత్ వీక్షించిన బీజేపీ నేతలు



షాద్‌నగర్: ప్రధాని మోదీ నిర్వహించిన మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని ఆదివారం షాద్‌నగర్‌లో బీజేపీ నేతలు వీక్షించారు. పట్టణంలోని సీఎస్‌కే వెంచర్‌లో పార్టీ పట్టణ అధ్యక్షుడు హరిభూషణ్ పటేల్ ఇంట్లో మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని టీవీలో వీక్షించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకుడు నాగురావ్ నామోజీ, స్థానిక నాయకులు మురళీ, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌లలో మరమ్మతులు పూర్తి



సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

కొత్తూరు: మండలంలో ఇటీవల కురిసిన వర్షాలు, భారీ ఈదురుగాలులకు పలు విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. దీంతో ముందస్తుగా వినియోగదారులు, ప్రజలకు సమాచారం ఇచ్చి అధికారులు ఆదివారం పలు సబ్‌స్టేషన్‌లలో మరమ్మతులు చేపట్టారు. ఇందులో భాగంగా గాలులు, వర్షాల కారణంగా దెబ్బతిన్న పరికరాలను మార్చి కొత్త వాటిని బిగించారు. మరమ్మతులు పూర్తయిన తర్వాత విద్యుత్ సరఫరాను సాయంత్రం 4 గంటలకు పునరుద్ధరించినట్లు ట్రాన్స్‌కో ఏఈ రమేశ్‌గౌడ్ తెలిపారు.

ఉద్యాన పంటలను సాగు చేయాలి



కందవాడలో రైతులకు అవగాహన కల్పిస్తున్న సైంటిస్ట్‌లు, విద్యార్థులు

చేవెళ్ల: రైతులు ఉద్యాన పంటలను సాగు చేసి, విరివిగా లాభాలు సాధించాలని శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం సైంటిస్ట్‌లు, విద్యార్థులు అన్నారు. ఆదివారం మండలంలోని కందవాడ గ్రామంలో సైంటిస్ట్‌లు, ప్రొఫెసర్‌లతో కలిసి మోజర్ల 2021 బ్యాచ్ విద్యార్థులు రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు ఉద్యాన పంటల సాగుతో పాటుగా సమగ్ర సస్యరక్షణ, సేంద్రియ వ్యవసాయం, పచ్చిరొట్ట, బహుళ అంచెల పంట, పట్టు పురుగుల పెంపకం, బిందు సేద్యం తదితర అంశాలపై దృష్టి సారించాలని తెలిపారు. కార్యక్రమంలో సైంటిస్ట్‌లు డా.జ్యోతి, ప్రణీత్‌కుమార్, అసిస్టెంట్ ప్రొ.డా.శ్రీనివాస్, విద్యార్థులు స్వాతి, అఖిల, సంతోష, సానియా తదితరులు పాల్గొన్నారు.

యువత చదువు, క్రీడలపై దృష్టి సారించాలి



విజేతలకు బహుమతి అందజేస్తున్న ఏసీపీ రాజు, రవీందర్ తదితరులు

యాచారం: యువత వ్యసనాలకు దూరంగా ఉంటూ చదువు, క్రీడలపై దృష్టి సారించాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు అన్నారు. మండల పరిధిలోని మొండిగౌరెల్లిలో బీజేపీ మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్ నిర్వహించిన క్రికెట్ పోటీలు ఆదివారం ముగిసాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏసీపీ రాజు విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. యువత లక్ష్యాన్ని నిర్దేశించుకుని వాటి సాధనకు కృషి చేయాలన్నారు. రూ.లక్షన్నర వరకు ఖర్చుతో పోటీలు నిర్వహించడంపై రవీందర్‌ను ఏసీపీ ప్రత్యేకంగా అభినందించారు.



చేవెళ్ల: ముడిమ్యాలలో వరంగల్ సభకు వెళ్తున్న నాయకులు, కార్యకర్తలు



చేవెళ్ల: ఆలూరు నుంచి బస్సులో సభకు వెళ్తున్న నాయకులు



చేవెళ్లలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఊరూరా గులాబీ సంబురం

రజతోత్సవ సభకు భారీగా తరలివెళ్లిన బీఆర్‌ఎస్ నాయకులు

- జెండా ఊపి వాహనాలను ప్రారంభించిన సీనియర్ నేతలు
- గ్రామగ్రామాన జెండాల ఆవిష్కరణ

చేవెళ్ల: బీఆర్‌ఎస్ పాతికేళ్ల ప్రస్థాన సభ చలో వరంగల్‌కు చేవెళ్ల ప్రాంతం నుంచి పెద్దసంఖ్యలో బీఆర్‌ఎస్ శ్రేణులు తరలివెళ్లారు. చేవెళ్ల నుంచి డీసీఎంఎస్ మాజీ చైర్మన్ పట్లోళ్ల కృష్ణారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు పెద్దోళ్ల ప్రభాకర్, నియోజకవర్గ అధ్యక్షుడు వంగ శ్రీధర్‌రెడ్డి, జిల్లా నాయకులు కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం గ్రామ గ్రామాల నుంచి బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు బస్సుల్లో తరలివెళ్లారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల నుంచి బస్సులు చేవెళ్లలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద నుంచి జెండా ఊపి సభకు తరలివెళ్లారు. గ్రామగ్రామాన పార్టీ నాయకులు పార్టీ జెండాలను ఎగురవేశారు. ఆలూరు గ్రామంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు షాబాద్ శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు.

ప్రజలు బీఆర్‌ఎస్ వైపే ఉన్నారు

మొయినాబాద్‌రూరల్: కేసీఆర్ పాలనలోనే గ్రామాల అభివృద్ధి చెందాయని, ప్రజలు బీఆర్‌ఎస్‌నే కోరుకుంటున్నారని సర్పంచ్‌ల సంఘం జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రాఘవరెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి అన్నారు. వరంగల్ సభకు ఆదివారం గ్రామ గ్రామాల నుంచి భారీగా నాయకులు తరలివెళ్లారు. అంతకుముందు జెండాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర వార్డు సభ్యుల ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు కొత్తపల్లి తిరుపతిరెడ్డి, అఖిల భారత రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముదిగొండ రవియాదవ్, శ్యామ్‌రావు, శ్రీహరియాదవ్, మండల విశ్వకర్మ సంఘం గౌరవ అధ్యక్షుడు నర్సింహాచారి, మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి, జైపాల్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం ఖాయం

శంకర్‌పల్లి: వరంగల్ ఎల్కతుర్తిలో జరిగిన బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ ద్వారా శ్రేణుల్లో జోష్ పెరిగిందని శంకర్‌పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాజునాయక్ అన్నారు. ఆదివారం ఆయన ఆధ్వర్యంలో వందలాది మంది శ్రేణులు వరంగల్ సభకు బయలుదేరి వెళ్లారు. రాజు నాయక్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ప్రజలకు నమ్మకం పోయిందని, ఏ సమయంలో ఎన్నికలు పెట్టినా బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

మాజీ ఎంపీపీ ఆధ్వర్యంలో..

రజతోత్సవ సభకు ఆదివారం మాజీ ఎంపీపీ ధర్మన్నగారి గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణం, మండలం నుంచి భారీ ఎత్తున బీఆర్‌ఎస్ శ్రేణులు బయలుదేరి వెళ్లారు. సభ అనంతరం మాజీ ఎంపీపీ మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్ ఎంతో కష్టపడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారని గుర్తు చేసుకున్నారు. రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ యే విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

కేసీఆర్ పాలనలోనే రాష్ట్రం సుభిక్షం

షాద్‌నగర్: కేసీఆర్ పాలనలో రాష్ట్రం అంతా సుభిక్షంగా ఉందని మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఆదివారం నిర్వహించిన బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ బహిరంగ సభకు షాద్‌నగర్ నుంచి మాజీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు భారీ ఎత్తున వాహనాల్లో తరలివెళ్లారు. ఈ సందర్భంగా పట్టణంలోని బీఆర్‌ఎస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించారు. కేసీఆర్ పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ఈ సందర్భంగా సభకు తరలివెళ్తున్న వాహనాల ర్యాలీని మాజీ ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు.



మొయినాబాద్‌రూరల్: బాకారంలో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు



మొయినాబాద్‌రూరల్: హిమాయత్‌నగర్‌లో బస్సులకు జెండా ఊపి ప్రారంభిస్తున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు అనంతరెడ్డి



శంకర్‌పల్లి: బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ వద్ద మాజీ ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి తదితరులు



శంకర్‌పల్లి: సభా ప్రాంగణం వద్ద మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్‌రాజునాయక్, నాయకులు



కొత్తూరు: జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు



కొందుర్గు: జెండా ఆవిష్కరణలో పాల్గొన్న నాయకులు



మొయినాబాద్: మొయినాబాద్‌లో..



షాద్‌నగర్: సభకు బస్సులో తరలివెళ్తున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, నాయకులు



షాబాద్: జెండా ఆవిష్కరణలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు అవినాశ్‌రెడ్డి తదితరులు

కేంద్ర నిధులతోనే బియ్యం పంపిణీ

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: కేంద్ర ప్రభుత్వ నిధులతోనే రాష్ట్రంలో రేషన్ దుకాణాల ద్వారా లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేస్తోందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని అన్నారం గ్రామంలో పార్టీ మండల అధ్యక్షుడు పిట్టల సురేష్ ఆధ్వర్యంలో గావ్ చలో.. బస్తీ చలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విష్ణువర్ధన్‌రెడ్డి, బాబయ్యలు హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలోని రేషన్ దుకాణం, అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలను వారు సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. రేషన్ దుకాణాల్లో రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న ఉచిత బియ్యానికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందన్నారు. కేంద్ర నిధులతో ఇచ్చే బియ్యాన్ని తామే ఇస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం చెప్పుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటింటికీ తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పార్టీ నాయకులు కార్యకర్తలు రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు ఎప్పటికప్పుడూ వివరించి వారిని చైతన్య పరచాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు కుర్మయ్య, రఘుగౌడ్, ప్రశాంత్‌గౌడ్, శివశంకర్, వినోద్ నాయక్, పసుల ప్రశాంత్, విట్యాల నర్సింహ, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి పెద్దపీట

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: నిరుపేదల ఆరోగ్య సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని కొందుర్గు, చౌదరిగూడ, ఫరూఖ్‌నగర్, కొత్తూరు, షాద్‌నగర్ మున్సిపాలిటీకి చెందిన 30 మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.13లక్షల 37వేల 500 విలువైన చెక్కులను ఆయన పంపిణీ చేశారు. పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం పూర్తిగా భరోసా కల్పిస్తుందని, ఇందులో భాగంగానే ప్రభుత్వం పేదలకు ఆరోగ్య బీమా పథకాన్ని ప్రవేశపెట్టి అమలు చేస్తుందన్నారు. ఆరోగ్యం విషయంలో ఎవరూ నిర్లక్ష్యం చేయొద్దన్నారు. కార్యక్రమంలో నాయకులు బాబర్‌ఖాన్, శ్రీకాంత్‌రెడ్డి, రఘునాయక్, కృష్ణారెడ్డి, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక దోపిడీని అరికట్టాలి

సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు రామస్వామి



మాట్లాడుతున్న రామస్వామి

మొయినాబాద్: దేశంలో జరుగుతున్న ఆర్థిక దోపిడీని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అరికట్టాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు, చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కె.రామస్వామి డిమాండ్ చేశారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని పెద్దమంగళారంలో ఆదివారం సీపీఐ గ్రామ శాఖ మహాసభను కార్యదర్శి మల్లేశ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో మోదీ ప్రభుత్వం వచ్చాక అదాని, అంబానీల ఆస్తులు వేల కోట్లకు పెరిగాయన్నారు. కానీ పేదల బతుకులు మాత్రం మారలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో జరుగుతున్న ఆర్థిక దోపిడీని అరికట్టి ప్రజలందరికీ సంపద పంచేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అందు కోసం ప్రజలు పోరాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ సందర్భంగా పెద్దమంగళారం గ్రామశాఖ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ కార్యదర్శిగా మల్లేశ్, సహాయ కార్యదర్శులుగా రాములు, కిష్టయ్య, సభ్యులుగా అనురాధ, మాధవి, దర్శన్, సిద్దయ్య, చంద్రకళ, యాదగిరి, లక్ష్మి, సురేష్, ధనుంజయ్, షహదాబీలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

లారీ ఓనర్స్, డ్రైవర్స్ అసోసియేషన్ కార్యవర్గం

ఆమనగల్లు: పట్టణ లారీ ఓనర్స్, డ్రైవర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలో ఆదివారం లారీ ఓనర్స్, డ్రైవర్స్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో నూతన అధ్యక్షుడిగా గోపినాయక్, ఉపాధ్యక్షుడిగా జహంగీర్, ప్రధాన కార్యదర్శిగా నరేశ్, కార్యదర్శిగా కృష్ణయ్య, కోశాధికారిగా సలీమ్‌ను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సభ్యులు మల్లేశ్, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: ప్రజా సంక్షేమమే ప్రజాప్రభుత్వ లక్ష్యమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన నగరంలోని తన నివాసంలో పలువురు బాధితులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమెల్యే మాట్లాడుతూ.. పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేస్తోందన్నారు. పారదర్శక పాలన అందించేందుకు ప్రభుత్వం అనేక సంస్కరణలను తీసుకొచ్చిందని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి సాహసోపేత నిర్ణయాలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు రామకృష్ణ, జవహర్‌లాల్‌నాయక్, హీరాసింగ్, స్టాలిన్ పాల్గొన్నారు.

ఉగ్రదాడికి నిరసనగా ర్యాలీ



సాగర్ రహదారిపై ర్యాలీ

తుర్కయంజాల్: పహల్గాం ఉగ్రదాడిని నిరసిస్తూ మున్సిపల్ పరిధిలోని ఇంజాపూర్‌లో హిందూ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. సాగర్ రహదారిపై నిరసన తెలిపి.. మృతులకు నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర కోశాధికారి రమేష్, కార్యదర్శి పురుషోత్తం, యువ మోర్చ ప్రొటోకాల్ కన్వీనర్ నోముల కార్తీక్ గౌడ్, ఎస్టీ మోర్చా రాష్ట్ర కోశాధికారి శ్రీనివాస్ నాయక్, సీనియర్ నాయకులు బల్‌దేవ్‌రెడ్డి, తూళ్ల నరసింహగౌడ్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

నిధులు లేక.. పనులు సాగక

- షాద్‌నగర్‌లో అర్ధంతరంగా నిలిచిన మోడల్ మార్కెట్ నిర్మాణ పనులు
- మొదట్లో వేగంగా సాగి.. తర్వాత నెమ్మదించిన వైనం
- నిర్మాణం పూర్తయితే తగ్గనున్న ట్రాఫిక్ సమస్యలు



అసంపూర్తిగా మోడల్ మార్కెట్ నిర్మాణం

షాద్‌నగర్: దళారుల వ్యవస్థకు చరమగీతం పాడుతూ స్థానిక రైతులకు గిట్టుబాటు ధర లభించేలా.. వినియోగదారులకు నాణ్యమైన కూరగాయలు, మాంసం అందుబాటులో ఉండేలా అన్ని మున్సిపాలిటీలు, పట్టణాల్లో మోడల్ మార్కెట్ నిర్మాణాలకు గత ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కానీ నిధులు విడుదల కాకపోవడంతో నిర్మాణ పనులు సాగడం లేదు. ఫలితంగా షాద్‌నగర్ మున్సిపాలిటీలో నిర్మిస్తున్న ఈ మార్కెట్ నిర్మాణ పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి.

అర్ధంతరంగా నిలిచి..

షాద్‌నగర్ మున్సిపాలిటీలో జనాభా సామర్థ్యం, ప్రజల అవసరాలకు అనుగుణంగా పాత మార్కెట్ స్థలం సుమారు రెండు ఎకరాల్లో అన్ని హంగులు, సౌకర్యాలతో కూడిన మోడల్ మార్కెట్‌ను నిర్మించేందుకు చర్యలు చేపట్టారు. అయితే ఈ నిర్మాణ పనులను 28 మార్చి 2022లో గత ప్రభుత్వ హయాంలో నాటి ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌తో కలిసి మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. ఇందుకుగాను ప్రభుత్వం మొదట్లో రూ.4.50కోట్లు కేటాయించింది. ఏడాదిలోపు నిర్మాణ పనులు పూర్తి చేసే విధంగా ప్రణాళికలు రూపొందించి మార్కెట్ నిర్మాణ పనులు ప్రారంభించారు. అయితే మొదట్లో శరవేగంగా నిర్మాణ పనులు చేపట్టి రెండు స్లాబ్‌లు వేశారు. మరిన్ని దుకాణాల షెడ్ల కోసం తీసిన గుంతలు కేవలం పునాదులకే పరిమితమయ్యాయి. అయితే పెద్దఎత్తున నిర్మించ తలపెట్టిన మార్కెట్ నిర్మాణానికి నిధులు సరిపోకపోవడంతో అప్పట్లో ప్రభుత్వం నిర్మాణ అంచనాలను సవరించింది. రూ.11కోట్లు కేటాయిస్తూ జీఓను కూడా గత ప్రభుత్వం జారీ చేసింది. అయితే ఇందుకు పరిపాలన అనుమతులు వచ్చేలోగా ప్రభుత్వం మారడం, నిధులు విడుదల కాకపోవడంతో కాంట్రాక్టర్ నిర్మాణ అర్ధంతరంగా ఆపేశారు. సుమారు రెండేళ్లుగా నిర్మాణ పనులు నిలిచిపోయాయి.



పునాదులకే పరిమితమైన షెడ్ నిర్మాణ పనులు

కార్పొరేట్ షాపింగ్ మాల్ తరహాలో..

అత్యాధునిక హంగులతో నిర్మించే సమీకృత మార్కెట్‌లో మొత్తం 109 దుకాణ సముదాయాలను నిర్మించ తలపెట్టారు. అయితే ఇందులో 30 దుకాణాలు మాంసం విక్రయాలకు కాగా మరో 18 దుకాణాలు పూలు, పండ్ల వ్యాపారానికి, మిగిలిన 60 దుకాణాలు మాత్రం కూరగాయలు అమ్ముకునేందుకు కేటాయించనున్నారు. కార్పొరేట్ షాపింగ్ మాల్ తరహాలో ఈ సమీకృత మార్కెట్‌ను నిర్మించాలని ప్రణాళిక రూపొందించారు.

ఒకేచోట అన్నీ లభ్యమయ్యే విధంగా

మున్సిపాలిటీలో నిర్మించే ఈ మార్కెట్ ద్వారా వెజ్, నాన్‌వెజ్, కూరగాయలు, పండ్లు తదితర వ్యాపారాలన్నీ ఒకేచోట నిర్వహించే విధంగా ప్లాన్ రూపొందించారు. ఇది పూర్తయితే రైతులు, వ్యాపారులతో పాటుగా వినియోగదారులకు ఎంతో మేలు చేకూరనుంది. వినియోగదారులు మార్కెట్‌కు వచ్చారంటే అన్ని రకాల కూరగాయలు, పండ్లు, పూలు, ఆకుకూరలు, మాంసం ఇలా అన్నీ ఒకేచోట కొనుగోలు చేసే అవకాశం ఉంటుంది.

ట్రాఫిక్ సమస్యలు తగ్గే అవకాశం

సమీకృత మార్కెట్ నిర్మాణం పూర్తయితే పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు తగ్గే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం చాలా మంది వ్యాపారులు, రైతులు రోడ్ల పైనే కూరగాయలు, పండ్లు, పూలు, మాంసం విక్రయాలు చేపడుతున్నారు. దీంతో రోడ్లపై వాహనాల రాకపోకలకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. సంత ఉండే రోజుల్లో అయితే ట్రాఫిక్ సమస్యలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మార్కెట్ నిర్మాణం పూర్తయితే ఇలాంటి సమస్యలు చాలావరకు అధిగమించే అవకాశాలు ఉన్నాయి. ప్రజలకు సమయం కూడా ఆదా అవుతుంది.

చర్యలు తీసుకుంటాం



మోడల్ మార్కెట్ నిర్మాణానికి నిధులు విడుదల కాకపోవడంతో నిర్మాణ పనులు ఆగిపోయాయి. ప్రభుత్వం నుంచి నిధులు విడుదలైన వెంటనే నిర్మాణ పనులు చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటాం.

– సునీత, కమిషనర్, షాద్‌నగర్